క్లుప్తంగా...

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్య బృందం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నానగర్‌లో సీలిమ హాస్పిటల్ సౌజన్యంతో బీఆర్‌ఎస్ నాయకుడు సామల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ముఖ్య అతిథిగా చైర్మన్ కొండల్‌రెడ్డి పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజల కోసం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రోగులను జనరల్ ఫిజీషియన్లతో పాటు ఆర్థోపెడిక్, పల్మనాలజీ, గైనకాలజీ వైద్య నిపుణులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

10 నిమిషాలు ఆలస్యం..?

ఏసీఈ కళాశాల పరీక్ష కేంద్రంలో గ్రూపు–1 ప్రిలిమ్స్ పరీక్ష

ఘట్‌కేసర్: గ్రూపు–1 ప్రిలిమ్స్ పరీక్ష పేపర్ సమయానికి అందలేదని ఓ అభ్యర్థి ఆరోపించాడు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్ ఏసీఈ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలోని ఓ గదిలో 10.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా సుమారు 10 నిమిషాలు ఆలస్యంగా ఇచ్చారని, చివరలో 10 నిమిషాలు అదనంగా సమయం ఇస్తామని చెప్పి ఇవ్వలేదని ఆరోపించాడు. 10.30 గంటల తర్వాత పరీక్ష పేపర్ బండిల్ వచ్చిందని, గదిలో మాకు అందరికీ చూపించి పేపర్ ఇచ్చేసరికి సుమారు 10 నిమిషాలు ఆలస్యమైందన్నారు. సమయం ముగిసిన వెంటనే బెల్ మోగిందని అప్పుడే తీసుకున్నారన్నాడు. తాము బయటకు వచ్చే కొన్ని గదుల్లో ఇంకా రాస్తున్నట్లు కనిపించిందన్నాడు. ఈ విషయమై స్థానిక సీఐ మహేందర్‌రెడ్డిని వివరణ కోరగా పరీక్ష పేపర్ ఆలస్యంగా అందినట్లు అభ్యర్థులు చెప్పలేదన్నారు.

ప్రాణరక్షణకు కరాటే, తైక్వాండో



కీసర: ఆపద సమయంలో ప్రాణరక్షణకు ఉపయోగపడే కరాటే, తైక్వాండో క్రీడల్లో విద్యార్థులు, యువతి, యువకులు శిక్షణ అవసరమని డ్రాగన్ ఫిస్ట్ కరాటే అకాడమి గ్రాండ్ మాస్టర్ కంటే సత్యశంకర్ అన్నారు. ఆదివారం తమ సంస్థలో కరాటేలో శిక్షణ పూర్తిచేసుకొని ఇటీవల నిర్వహించిన పోటీల్లో సత్తాచాటిన క్రీడాకారులకు బెల్టులను అందజేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, నేతలు శ్రీకాంత్‌యాదవ్, అరవింద్‌శర్మ, సంగీత, నితీష్, జగదీష్, వినయ్‌కుమార్‌రెడ్డి, మహేందర్, అక్షయ్, సమక్‌రెడ్డి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ మాట్లాడొద్దన్నందుకు..

– ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

జవహర్‌నగర్: ఫోన్ మాట్లాడవద్దని తల్లి వారించడంతో యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సాకు చెందిన మేనకా నాయక్, భర్త మున్నా నాయక్‌ల కుమారుడు అనిల్(18)తో జమ్మిగడ్డలో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా అనిల్ తరచూ ఫోన్‌లో మాట్లాడుతున్నాడని తల్లి మేనకానాయక్ వద్దని వారించింది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అనిల్ సీలింగ్ రాడ్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూడగా తలుపులు తీయకపోవడంతో చుట్టుపక్కల వారి సహాయంతో తలుపులు తెరిచారు. అప్పటికే మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భక్త సమాజానికి బీఎల్‌ఆర్ ఆర్థిక సాయం



మల్లాపూర్: నాచారం ఓల్డ్ విలేజ్‌లోని భక్త సమాజం భవనానికి బీఎల్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారు లక్ష్మారెడ్డి ఆర్థిక సాయం అందించారు. మొదటి అంతస్తులో మిగిలిపోయిన పనులు పూర్తి చేసేందుకు ఇటీవల భక్త సమాజం సంఘం సభ్యులు బీఆర్‌ఎస్‌ను కలిశారు. వెంటనే స్పందించిన ఆయన ఆదివారం నాచారం చేరుకుని రూ.లక్ష చెక్కును అందించారు. నాచారం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నానరు. కార్పొరేటర్ సాయిజెన్ శేఖర్, స్థానికులు సాయిబాబా, ప్రేమ్‌కుమార్, జగన్నాథం, యాదగిరి, యాదయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే దేశాభివృద్ధి సాధ్యం



జవహర్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్



టోర్నమెంట్ విజేత చౌదరిగూడ జట్టుకు షీల్డ్ అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి, భద్రారెడ్డి

- కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- జవహర్‌నగర్‌ను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతా..
- రూ.9 కోట్లతో అభివృద్ధి పనులను షురూ..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో 15, 26, 27, 25, 23, 24, 28, 3, 19, 16 డివిజన్లలో రూ.9 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి మంత్రి చామకూర మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో 10 ఏళ్లలోనే 100 ఏళ్ల నాటి అభివృద్ధి కనిపిస్తోందన్నారు. అభివృద్ధి అంటే తెలంగాణ అని, దేశమంతటా వినిపిస్తుందంటే సీఎం కేసీఆర్ కృషి, పట్టుదల వలనేనన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. పేదలు నివసించే జవహర్‌నగర్‌పై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానా ప్రారంభం..

జవహర్‌నగర్ కార్పొరేటర్ 5వ డివిజన్‌లో బస్తీ దవాఖానాకు మంత్రి మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్ ఏకే.మురుగేష్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యమని, పేదల వద్దకు వైద్యాన్ని అందించేందుకు బస్తీ దవాఖానాలను నిర్మిస్తున్నామన్నారు. అనంతరం కార్పొరేటర్ ఏకే.మురుగేష్ మంత్రి మల్లారెడ్డికి ఘన స్వాగత పలికి గజమాలతో సత్కరించారు.

ముగిసిన మల్లారెడ్డి క్రికెట్ టోర్నమెంట్

ఘట్‌కేసర్: కాచవానిసింగారంలో నిర్వహించిన మల్లారెడ్డి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ముగిసింది. ఫైనల్స్‌లో చౌదరిగూడ, కాచవానిసింగారం తలపడగా వరుసగా రెండోసారి చౌదరిగూడ జట్టు విజేతగా నిలిచింది. ముఖ్య అతిథిగా మంత్రి మల్లారెడ్డి, మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ భద్రారెడ్డితో కలిసి ఫైనల్స్‌ను వీక్షించారు. అనంతరం విన్నర్, రన్నర్లకు కప్‌తో పాటు రూ.50, రూ.25 వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, సర్పంచులు వెంకటేశ్‌గౌడ్, సురేశ్, ఎంపీటీసీ రామారావుముదిరాజ్, నాయకులు మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

ఉద్యమంలో కవులు, రచయితల పాత్ర గొప్పది

సాహితీ ఉత్సవాలను ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కవులు, కళాకారుల పాత్ర గొప్పదని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో తెలంగాణ సాహిత్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కవులు, కవయిత్రులు, సాహితీవేత్తలు తమ పద్య, వచన కవిత్వాలతో తెలంగాణ ఔన్నత్యాన్ని ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కవులు రాసిన పాటలు, పాడిన పాటలు ప్రజల్లో ఎంతో ఉత్తేజాన్ని నింపాయన్నారు. కవులను ప్రభుత్వం గుర్తించడంతో పాటు వారికి తగిన ప్రాధాన్యతనిస్తోందని ఆయన పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో మన సాహిత్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తెలంగాణ తేజోమూర్తుల పేరుమీద పురస్కారాలను అందజేస్తోందని తెలిపారు. రాష్ట్రం అవతరించి పదేళ్లు కావొస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సాహితీ దినోత్సవాన్ని జిల్లాలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని, కవుల కవితా సంపదతో విరాజిల్లుతోందన్నారు. తెలంగాణ పోరాటాల గడ్డ అని, సాహితీరంగంలో తమదైన ముద్ర వేసిన మొదట కావ్యం, మొదటి కవి అందరూ మన తెలంగాణవాదులేనన్నారు. ఈ సందర్భంగా కవులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు, పారితోషికాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి బలరామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్‌రావు, శామీర్‌పేట ఎంపీపీ దాసరి ఎల్లుబాయి, శామీర్‌పేట జెడ్పీటీసీ అనిత, మేడ్చల్ జెడ్పీటీసీ శైలజారెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్మన్ పావని, కవులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను ఉపయోగించుకోవాలి

మేడ్చల్: వృథా సామాగ్రి సేకరణ కోసం నిర్వహిస్తున్న రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను వార్డు ప్రజలు ఉపయోగించుకోవాలని పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఆయన కాలనీవాసులతో కలిసి ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్‌ను ప్రారంభించి వార్డులో పర్యటించి వృథా సామాగ్రి సేకరణపై అవగాహన కల్పించారు. ఇళ్లలో వృథాగా ఉండే చెక్క వస్తువులు, సామాగ్రి, బట్టలు, పుస్తకాలు వంటి ఉపయోగంలో లేని సామాగ్రి ఉన్న వారు సెంటర్‌లో ఇవ్వాలని కోరారు. సామాన్లను సెంటర్‌కు తీసుకువచ్చి ఇవ్వాలని ఆయన కోరారు. పర్యావరణం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు.



వార్డులో అవగాహన కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ గుర్తింపు కార్డుల పంపిణీ



చౌదరిగూడలో కార్డులు అందజేస్తున్న అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, అనిల్‌గౌడ్

ఘట్‌కేసర్: చౌదరిగూడలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ఆ గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు కట్ట ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ మండల కోశాధికారి అనిల్‌గౌడ్ హాజరై గుర్తుంపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు నర్సింగ్‌రావు, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వినోద్ పాల్గొన్నారు.

వైభవంగా పూజలు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజయ్‌సాయిగార్డెన్‌లో శ్రీరామాలయంలో పుష్కర మహాకుంబాభిషేకాన్ని వేదపండితులు ఆదివారం వైభవంగా నిర్వహించరు. మాధవానంద సరస్వతి స్వామిజీ ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి. మంత్రి చామకూర మల్లారెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కాలనీవాసులు, శ్రీరామదేవస్థాన సమితి సభ్యులు తెలిపారు.



పలువురికి సేవారత్న అవార్డులు



జాతీయ సేవారత్న అవార్డు అందుకుంటున్న రామకోటేశ్వర్, రజనీ

మల్లాపూర్: నాచారం డివిజన్‌కు చెందిన దంపతులు రామకోటేశ్వర్, రజనీ దంపతులకు జాతీయ సేవా రత్న అవార్డు వరించింది. నాచారం హెచ్‌ఎంటీ నగర్ కమ్యూనిటీ హాల్ అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకోటేశ్వర్ దంపతులకు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సదానందం, మోహన్‌రెడ్డి, అమరేందర్ తదితరుల పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన కాప్రా యువకులు



ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన కాప్రాకు చెందిన యువకులు

కాప్రా: కాప్రా సర్కిల్‌కు చెందిన పలువురు యువకులు ఆదివారం బీజేపీలో చేరారు. బీజేపీ ఎమ్మెల్యే, చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సమక్షంలో పలువురు యువకులు కాషాయ కండువా కప్పుకున్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్‌లో ఈటల రాజేందర్ వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశంలో ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి బీజేపీలో చేరినట్లు తెలిపారు. కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వమే వస్తుందని, రాష్ట్రం కూడా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తే రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంజునాథ, నిదీష్, విజయ్, సమీర్, నితీష్, సిద్ధార్థ, మల్లికార్జున్, జ్ఞానేశ్వర్, తరుణ్, సాయితేజ, కౌశిక్, హరివర్ధన్ తదితరులున్నారు.



నృత్య ప్రదర్శన భళా

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నృత్యా నికేతన్ ప్రతి భారాజ్‌గౌడ్ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మహా గణపతిం, ముద్దుగారే యశోద, అదిగో అల్లదిగో, జానపద నృత్యం, పలుకే బంగారమాయే, దశావతారం, తరంగం, నీలమేఘ శరీర మొదలైన అంశాలను ప్రదర్శించారు. వైష్ణవి, వర్షిక, సహస్ర, ఈషా, సిద్ధికా, నిత్యశ్రీ, పావని, రాజ్ఞ తదితరుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. హైకోర్టు అడ్వకేట్ సందీప్ కుమార్, రామ్‌శెట్టి తదితరులు కళాకారులను ఆశీర్వదించారు.

మేడ్చల్‌పై బీజేపీ జెండా ఎగురవేస్తాం



సమావేశంలో ప్రసంగిస్తున్న రఘునందన్‌రావు

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మేడ్చల్: రాబోయే ఎన్నికల్లో మేడ్చల్ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామని బీజేపీ నాయకుడు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మేడ్చల్‌లో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ మహాజన్ సంపర్క్ అభియాన్ సంయుక్త మోర్చాల సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నియోజకవర్గంలో అన్ని మోర్చాల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నారని, ఎన్నికల వరకు ఇదేవిధంగా పనిచేస్తే మేడ్చల్‌పై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. ప్రతి కార్యకర్త ఇరవై ఇళ్లను దత్తగా తీసుకుని 9 ఏళ్లలో ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం అందజేసిన పథకాలను వివరించాలని అన్నారు. మేడ్చల్ ప్రాంతం అభివృద్ధికి సుచిత్ర నుంచి కాళ్లకల్ వరకు రూ.1200 కోట్లు వెచ్చించి ఆరులైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టిందని అన్నారు. రెండవ విడతో జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేసిందన్నారు. కేంద్రం ఎలాంటి సవతి ప్రేమలు చూపకుండా అన్ని రాష్ట్రాలను అభివృద్ధి చేస్తుందని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు పెద్ది మోహన్‌రెడ్డి, ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నాయకులు బుద్ధి శ్రీనివాస్, తిరుమల్‌రెడ్డి, నాలుగు మండలాల, మున్సిపాలిటీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీలో భారీగా చేరికలు

మేడ్చల్‌రూరల్: పలు ప్రాంతాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేశారు. ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాప్రా మున్సిపాలిటీకి చెందిన వివిధ పార్టీల నాయకులు, శంషాబాద్, షాపూర్ ప్రాంతాలకు చెందిన ఇతర పార్టీల నాయకులు ఆదివారం మేడ్చల్ మండలం పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసానికి తరలి రావడంతో ఈటల రాజేందర్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈటల నివాసం వద్ద నాయకుల సందడి..

బీజేపీలో తాజా పరిణామాల నేపథ్యంలో ఆదివారం బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఇంటి వద్ద ముఖ్య నేతలు, నాయకుల సందడి నెలకొంది. ఇటీవల ఈటల ఢిల్లీ వెళ్లడం, అస్సాం వెళ్లి రావడం, ఈటల రాజేందర్‌కు ప్రచార కమిటీ బాధ్యతలు అప్పగించి, సీఎం అభ్యర్థిగా ప్రాజెక్ట్ అవుతారనే ప్రచారం జరుగుతుండటంతో ఏం జరుగుతుంతో తెలుసుకునేందుకు నాయకులు ఆయన నివాసానికి చేరుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్, వివిధ నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు ఆయన నివాసంలో కలిసి తాజా పరిణామాలపై చర్చించినట్లు సమాచారం.



బీజేపీలో చేరిన వారితో ఈటల రాజేందర్

రాజ్యాంగంతో ప్రతి ఒక్కరికీ మేలు



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న శేఖర్‌నాయక్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: అంబేడ్కర్ భారతావనికి అందించిన రాజ్యాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా, రాజకీయంగా ఎంతో లాభపడుతున్నామని అన్నోజిగూడ బంజారా యూత్ అధ్యక్షుడు శేఖర్‌నాయక్ అన్నారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి పట్టణంలో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహం పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను అమలు చేయాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని, అంబేడ్కర్ ఎస్సీ, ఎస్టీలకే కాకండా దేశంలోని ప్రతి ఒక్కరి కోసం రాజ్యాంగం రచించాడన్నారు. కార్యక్రమంలో దాసు, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, నారాయణ, యాదగిరి, సంతోశ్‌కుమార్, శ్రీరామ్, అంజయ్య, అనిల్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్‌–1 ప్రిలిమినరీ ఎగ్జామ్



మేడ్చల్‌లోని స్ఫూర్తి కళాశాల వద్ద..

మేడ్చల్‌రూరల్: గ్రూప్–1 ప్రిలిమినరీ ఎగ్జామ్ మేడ్చల్ మండలంలో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 8 కేంద్రాల్లో 2,972 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేశారు. 1583 మంది అభ్యర్థులు హాజరుకాగా 1389 మంది గైర్హాజరయ్యారు. మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పలు పరీక్షా కేంద్రాలను మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, సీఐ రాజశేఖర్‌రెడ్డి కేంద్రాలను సందర్శించారు. ఎస్‌ఐలు మురళీధర్, రఘురాం, సిబ్బంది కేంద్రాల వద్ద బందోబస్తులో పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ మండలంలో..

ఘట్‌కేసర్: మండలంలో 10 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో మొత్తం 8,329 మంది అభ్యర్థులను కేటాయించగా 4,427 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. 3,902 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు నాగార్జునరెడ్డి, ధనంజయ్య, సుధాకర్, జ్ఞానేందర్‌రెడ్డి పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



అంకుషాపూర్ ఏసీఈ కళాశాల వద్ద భద్రత పర్యవేక్షిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

పద్మశాలీలు ఐక్యంగా రాణించాలి



ఉప్పల్: ఉప్పల్ చిలుకానగర్ పద్మశాలి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం ఈస్ట్ కళ్యాణపురి కమ్యూనిటీ హాల్‌లో అడహక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు మసన చిన్నప్ప, యాదాద్రి భవనగిరి జిల్లా పీఓపీఏ అధ్యక్షుడు వనం శాంతి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలీల ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పద్మశాలీలు రాజకీయ, ఆర్థిక రంగాల్లో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో అడహక్ కమిటీ సభ్యులు ఆడేపు అంజయ్య, దేవసాని బాలచందర్, గౌడ శ్రీశైలం, సకినాల ప్రసాద్, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.